క్లుప్తంగా

చెరువుల పరిశీలన


దేవరచెరువుకట్టను పరిశీలిస్తున్న అధికారులు

కదిరి అర్బన్: మండల పరిధిలోని కాలేపల్లి వద్దనున్న దేవరచెరువు, కుమ్మరవాండ్లపల్లిలోని వితలరాయుని చెరువులను తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీఓ పోలప్ప, ఇరిగేషన్ ఏఈ మహేష్ బుధవారం పరిశీలించారు. కట్ట పటిష్టత, చెరువు మరువ పారితే లోతట్టు ప్రాంతాల పరిస్థితి గురించి ఆరా తీశారు.

గ్రామాల అభివృద్ధికి శ్రీకారం

తాడిమర్రి: ఉపాధి నిధులతో గ్రామాల అభివృద్ధికి శ్రీకారం చుడుతున్నట్లు ఎంపీడీఓ వెంకటరంగారావు తెలిపారు. మండలంలోని పిన్నదరి, కునుకుంట్ల, రామాపురం గ్రామాల్లో బుధవారం ఆయన మండల స్థాయి అధికారులతో కలసి 'పల్లె పండుగ– పంచాయతీ వారోత్సవాలు' నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు పిన్నదరిలో కమ్యూనిటీ సోక్‌పిట్, కునుకుంట్లలో రూఫ్‌టాప్ రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పనులకు, రామాపురంలో పంట కాల్వ పనికి భూమిపూజ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ 2024–2025 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ అనుసంధానంతో మంజూరైన సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, మినీ గోకులం పశువుల షెడ్లు, రైతుల పండ్లతోటల పెంపకం, నీటి కుంటలు తవ్వకం తదితర పనులు చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు ఆదెప్ప, లావణ్య, పుల్లయ్య, ఈఓఆర్డీ విజయ్‌శేఖర్ నాయుడు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

శానిటరీ వర్కర్ల సమస్యలు పరిష్కరించండి

ధర్మవరం అర్బన్: ప్రభుత్వ పాఠశాలల శానిటరీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కో కన్వీనర్లు అయాజ్‌ఖాన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎమ్మార్సీలో సిబ్బందికి వినతిపత్రం అందించారు. శానిటరీ వర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ వర్తింపజేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఈ నెల 21న ఎంఈఓ కార్యాలయం వద్ద ఒకరోజు దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు లక్ష్మీదేవి, కార్యదర్శి నాగవేణి తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌ను మరొక భవనంలోకి మార్చండి


బీసీ బాలికల హాస్టల్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

పుట్టపర్తి: భారీ వర్షాల నేపథ్యంలో కొత్తచెరువులోని బీసీ బాలికల హాస్టల్‌ను బుధవారం తహసీల్దార్ నీలకంఠారెడ్డి పరిశీలించారు. ఇక్కడ 165 మంది బాలికలు ఉంటున్నారు. హాస్టల్ నిర్వహిస్తున్న అద్దె భవనం శిథిలావస్థలో ఉండటాన్ని గుర్తించారు. సమీపంలో ఖాళీగా ఉన్న ఎస్సీ హాస్టల్ భవనంలోకి బీసీ హాస్టల్‌ను మార్చాలని వార్డెన్ సులోచనకు సూచించారు. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ


పనులను ప్రారంభిస్తున్న పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని మేడాపురం గ్రామంలో బుధవారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి మంజూరైన పలు సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే పరిటాల సునీత భూమి పూజ చేశారు. అనంతరం ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్ కుమార్, ఎంపీడీఓ శివశంకరప్ప, సీనియర్ నాయకుడు ఎల్.నారాయణ చౌదరితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

పుట్టపర్తి: బుక్కపట్నం మండలంలో రూ.3కోట్లతో సిమెంట్ రోడ్లు నిర్మించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం బుక్కపట్నంలో సర్పంచ్ నాగలక్ష్మితో కలిసి ఆయన సిమెంటు రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. అనంతరం బుచ్చయ్యగారిపల్లి, జానకంపల్లి తదితర గ్రామాల్లో భూమి పూజ చేశారు.

నట్టల నివారణతోనే జీవాల రక్షణ

- ఈ నెల 20 నుంచి 30 వరకు టీకాల పంపిణీ


బత్తలపల్లిలో మేత మేస్తున్న గొర్రెలు, మేకలు

బత్తలపల్లి: అంతరపరాన్న జీవులైన ఏలికపాములు, జలగలు, బద్దె పురుగులు కడుపులో చేరడం వల్ల గొర్రెలు, మేకలు మరణించే అవకాశం ఉంది. సకాలంలో జీవాలకు నట్టల నివారణ మందు (డీ వార్మింగ్) తాపించాలని బత్తలపల్లి ప్రాంతీయ పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ యం.శ్రీనివాసులు, డి.చెర్లోపల్లి పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి తెలిపారు. గొర్రెలు, మేకలలో సామూహిక అంతరపరాన్న జీవుల (నట్టల) నివారణ మందులు వేస్తే వాటి బరువు పెరిగి రైతులకు లాభాలు చేకూరుతాయన్నారు. అదేవిధంగా గొర్రెల్లో మరణాల శాతం తగ్గుతుందన్నారు. ధర్మవరం నియోజకవర్గంలోని ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల్లో గొర్రెలు, మేకలు 5,45,000 వరకు ఉన్నాయన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఈ నెల 20 నుంచి 30 వరకు సచివాలయాల్లోని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్లు గొర్రెలకు, మేకలకు టీకాలు అందజేస్తారన్నారు. పెంపకందార్లు వినియోగించుకోవాలని సూచించారు.

నట్టల వ్యాధి లక్షణాలు ఇలా...

భూమికి దగ్గరగా ఉన్న గడ్డిని తినడం వల్ల గొర్రెలలో ఉండే అంతరపరాన్న జీవుల గుడ్లు, పేడ ద్వారా నేలపై చేరి లార్వాలుగా అభివృద్ధి చెంది గడ్డిపై చేరి ఉంటాయి. ఈ గడ్డిని గొర్రెలు, మేకలు తిన్నప్పుడు తిరిగి శరీరంలోకి ప్రవేశిస్తాయి. పేడను ముద్దగా వేయడం, విరేచనాలు చేసినపుడు అందులో బద్దె పురుగులు కనిపిస్తాయి. గొర్రెలు శరీరానికి అందే పోషక పదార్థాలను నట్టలు ఉపయోగించుకోవడం వలన గొర్రెలు బలహీనంగా ఉంటాయి. కొన్ని రకాల అంతరపరాన్న జీవుల గొర్రెల శరీరం నుంచి రక్తాన్ని పీల్చుకోవడం వలన రక్తహీనత కలిగి కళ్లు తెల్లగా పాలిపోయి ఉంటాయి. జలగలు కాలేయంలో(లివర్) ఉండటం వలన ఆ భాగం దెబ్బతింటుంది. దీంతో గడ్డం కింద నీరు చేరి వాపు వస్తుంది. ఈ వాపు సాయంత్రం వేళల్లో మాత్రమే కనిపిస్తుంది. జీవాలు బలహీనంగా ఉండటం వలన రోగనిరోధక శక్తి తగ్గిపోవడం వల్ల న్యుమోనియా లాంటి ఇతర వ్యాధులు కూడా వ్యాపిస్తాయి.

నిర్ధారణ, చికిత్స..

పశువైద్యాధికారి ద్వారా పేడను పరీక్ష చేయించి, సిఫారసు చేసిన మందులు వాడాలి. చనిపోయిన గొర్రెలను పరీక్ష చేయించినా, ఏవైనా ఉన్నట్లయితే నిర్ధారించి మిగిలిన మందకు తగిన మందులు సూచిస్తారు. ఏడాదికి కనీసం నాలుగుసార్లు నట్టల నివారణ మందులు తాపించాలి. పశువైద్యాధికారి సూచనల మేరకు ఏలికపాములు ఉన్నట్లయితే ఆల్బెండజోల్, ఫెన్‌బెండజోల్ తాపించాలి. జలగలు ఉన్నట్లయితే ఆక్సిక్లోజనైడ్, రఫాక్సినైడ్, క్లోజంటాల్ వాడాలి. బద్దె పురుగులు ఉన్నట్లయితే నిక్లోజమైడ్ లాంటి మందులు తాపించాలి.

నట్టల మందు తాపించే ముందు.. తరువాత..

జీవాల వయస్సు బరువును బట్టి సరైన మోతాదు మందు ఇవ్వాలి. తక్కువగా ఇస్తే పనిచేయదు. ఎక్కువ మోతాదులో మందులు ఇవ్వడం వలన గర్భంతో ఉన్న జీవాలకు అబార్షన్ అయ్యే అవకాశం ఉంటుంది. నట్టల మందు తాపించే ముందురోజు తక్కువ మేత ఇవ్వాలి. ఉదయాన్నే జీవాలను మేతకు తీసుకుపోకముందే మందు తాపించాలి. మందును నాలుకపై నుంచి తాపిస్తే బాగా పని చేస్తుంది. నట్టల మందును తాపించిన తరువాత తిరిగి అదే ప్రదేశంలో మేపునకు జీవాలను తీసుకువెళ్లకూడదు. కడుపులో పెద్ద పురుగులు చనిపోయి నేలపై పేడ ద్వారా చేరిన గుడ్లు లార్వాలుగా ఉంటాయి. అవి తిరిగి గొర్రె శరీరంలోకి ప్రవేశించి నట్టలుగా అభివృద్ధి చెందుతాయి. మందులు తాపిన తరువాత కనీసం నెల రోజుల వరకూ ఇతర ప్రదేశాలలోని పచ్చిక బయళ్లలో మేపాలి. పచ్చిక బయళ్లలో మంచుకురిసే సమయాల్లో లార్వాలు పైకి వచ్చే అవకాశం ఉన్నందున ఆ సమయంలో మేపకూడదు. సూర్యరశ్మి బాగా ప్రసరించే సమయంలో ఈ లార్వాలు గడ్డి మొదళ్లలోకి వెళ్లిన తర్వాత మేపాలి. జీవాలలో జలగలు ఉన్నట్లయితే కాలేయం దెబ్బతిని ఉంటుంది. కాబట్టి మందులను తాపించిన తరువాత లివర్ టానిక్‌లను మూడు రోజులు ఇవ్వాలి. నత్తలు ఉన్న ప్రదేశాలలో నిల్వ ఉన్న నీటిని తాపించరాదు. దీనివల్ల జలగలు వ్యాప్తి చెందుతాయి.

ధర్మవరం నియోజకవర్గంలో జీవాల వివరాలు	
మండలం	గొర్రెలు, మేకల సంఖ్య
ధర్మవరం	1,30,000
బత్తలపల్లి	1,15,000
తాడిమర్రి	1,20,000
ముదిగుబ్బ	1,80,000

టీకాలు సద్వినియోగం చేసుకోండి



గొర్రెలు, మేకలలో నట్టల నివారణ కోసం ప్రభుత్వం చేపట్టిన నట్టల నివారణ టీకాలను సద్వినియోగం చేసుకోండి. నట్టల వ్యాధి వల్ల గొర్రెలు, మేకలు మృత్యువాత పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి. సొంత వైద్యం మాని, పశువైద్యాధికారుల సలహాలు, సూచనలు పాటించండి. టీకాలు వేయించడం వల్ల గొర్రెలు, మేకలు పుష్టికరంగా ఉంటాయి. మాంసం పెరిగి అధిక బరువు ఉంటాయి. తద్వారా పెంపకందారులకు మంచి లాభాలు ఉంటాయి.
– గుర్నాథరెడ్డి, పశువైద్యాధికారి, డి.చెర్లోపల్లి, బత్తలపల్లి మండలం

ఉపాధి పనులు ప్రజలకు వరం


సంగాలలో భూమి పూజ అనంతరం మాట్లాడుతున్న ఎంపీడీఓ నరసింహనాయుడు

బత్తలపల్లి: ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులు ప్రజలకు వరంలాంటివని ఎంపీడీఓ నరసింహనాయుడు తెలిపారు. బుధవారం మండలంలోని సంగాల, అప్రాచెరువు, ఈదుల ముష్టూరు పంచాయతీల్లో సర్పంచులు కంచనగారి రాజశేఖర్‌రెడ్డి, మొద్దిగారి శారదమ్మ, బత్తినన్న అధ్యక్షతన నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమానికి ఈఓఆర్డీ క్రిష్టప్పతో కలిసి ఎంపీడీఓ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ నిధుల ద్వారా పండ్లతోటల పెంపకం, సీసీ రోడ్లు, గోకులాలు, ఫారం పాండ్లు, సాగునీటి కాలువల పునరుద్ధరణ, వాన నీటి సంరక్షణ కోసం ప్రభుత్వ కార్యాలయ సముదాయాల్లో రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ పనులు చేపట్టి.. తద్వారా ప్రజల ఆర్థిక, సామాజిక స్థితిని మెరుగుపరచనున్నట్లు తెలిపారు. అనంతరం సంగాలలో రూ.10 లక్షలు, అప్రాచెరువులో రూ.10 లక్షలు, ఈదుల ముష్టూరులో రూ.25లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు: మండల పరిధిలోని మద్దిమడుగు, చెవిటివారిపల్లి గ్రామాల్లో బుధవారం ఎంపీడీఓ రఘునాథ గుప్తా ఆధ్వర్యంలో పల్లె పండుగ నిర్వహించారు. మద్దిమడుగులో రూ.10 లక్షలు, చెవిటివారిపల్లిలో రూ.5 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సురేఖ, ఈసీ బాలునాయక్, టీఏ జహీర్, ఎఫ్ఏలు జ్ఞానేశ్వర్, గంగరాజు నాయక్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు అందని పౌష్టికాహారం


గాండ్లపెంట అంగన్‌వాడీ కేంద్రం

గాండ్లపెంట: అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని లబ్ధిదారులకు అక్టోబర్ నెలకు సంబంధించిన పౌష్టికాహారం అందలేదు. ఒకటో తేదీనే సరుకు రావాల్సి ఉండగా ఇంతవరకూ పూర్తిస్థాయిలో చేరలేదు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం కింద ప్రతి నెలా రాగిపిండి, ఎండు ఖర్జూరం, చిక్కీ, బెల్లం, అటుకులతో కూడిన కిట్‌తో పాటు బియ్యం, కంది బేడలు, వంటనూనె, పాలు, కోడిగుడ్లు అందించాలి. మూడు నుంచి ఆరేళ్లలోపు ప్రీస్కూల్ విద్యార్థులకు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే మధ్యాహ్నం పౌష్టికాలతో కూడిన వేడివేడి ఆహారం వడ్డిస్తారు. అక్కడే పాలు తాపించి, కోడిగుడ్లు తినిపిస్తారు. ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులకైతే బలవర్ధకమైన బాలామృతంతో పాటు పాలు, కోడిగుడ్లు ఇళ్లకు పంపిణీ చేయాలి. నల్లచెరువు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని గాండ్లపెంట మండలంలో 62 మినీ, మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 118 మంది గర్భిణులు, 150 మంది బాలింతలు, 1,326 మంది ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులు లబ్ధిదారులుగా ఉన్నారు. పౌష్టికాహారం సరుకుల్లో పాలు, కోడిగుడ్లు, మరొక రకం మినహాయిస్తే మిగిలినవి చేరలేదు. దీంతో లబ్ధిదారులకు పౌష్టికాహారం పంపిణీ చేపట్టలేదు.

కాంట్రాక్టర్ల నుంచి స్పందన లేదు

పౌష్టికాహారం కిట్లు, బాలామృతం సరఫరా చేసే కాంట్రాక్టర్లు స్పందించడంలేదు. ఇటీవల కాంట్రాక్టర్లు మారారు. దీంతో సరుకు సరఫరాలో ఇబ్బందులు ఎదురయ్యాయి. స్టాకు రాగానే అన్ని కేంద్రాలకూ సరఫరా చేసి లబ్ధిదారుకు పంపిణీ చేయిస్తాం. –గంగరత్నమ్మ, సీడీపీఓ, నల్లచెరువు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


తూంచర్లలో పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రమాదేవి

కనగానపల్లి: తుఫాన్ ప్రభావంతో మంగళవారం రాత్రి నుంచి మండలంలోని అన్ని ప్రాంతాల్లో ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. ప్రజలు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. మండల వ్యాప్తంగా 40 మి.మీ. దాకా వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. మండలంలోని పలుచోట్ల వరి, వేరుశనగ, కాయగూరలు పంటలు దెబ్బతిన్నట్లు పలువురు రైతులు తెలిపారు. ఇక మండలంలోని తూంచర్ల గ్రామంలో కొండచరియల కింద నివాసం ఉన్న పలు కుటుంబాలను స్థానిక ప్రభుత్వ పాఠశాలకు తరలించి పునరావాసం కేంద్రం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ రమాదేవి స్థానిక రెవెన్యూ అధికారులతో కలసి పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. భోజన వసతి కల్పించి, ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని చెరువు, వంకలు, లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలు అప్రమత్తంగా తహసీల్దార్ తెలిపారు. ఇక వర్షాలు తగ్గే వరకు పంట కోతలు కోయవద్దని ఏఓ క్రిష్ణకుమారి రైతులకు సూచించారు.

పంటలు కోల్పోయాం.. ఆదుకోండి


ఎన్‌పీకుంటలో దెబ్బతిన్న వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ

ఎన్‌పీకుంట: తుపాను ప్రభావంతో ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు పంటలు నష్టపోయిన తమను ఆదుకోవాలని పలువురు రైతులు వ్యవసాయ అధికారిని కోరారు. మండల పరిధిలోని ఎన్‌పీ కుంట, గోవిందురాజులపల్లి, ధనియానిచెరువు, పి.కొత్తపల్లి గ్రామాల్లో వర్షాలతో ముంపునకు గురైన పంటలను ఏఓ లోకేశ్వరరెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చేతికొచ్చిన పంటలు దెబ్బతిన్నాయని, నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని పలువురు రైతులు ఏఓను కోరారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా దాదాపు ఆరు వేల ఎకరాల్లో వేరుశనగ సాగు చేశారని, ఇందులో 4వేల ఎకరాల్లో పంట కోత జరిగిందని తెలిపారు. నూర్పిడి కోసం ఎదురు చూస్తున్న రైతులు తుపాను ప్రభావంతో తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పంట కోత కోయని వేరుశనగ పొలాల్లో కాయల్లో మొలకలు వస్తున్నాయని అన్నారు. మరో రెండు రోజులు వర్షాలు ఇలాగే కొనసాగితే టమాట, తీగజాతి కూరగాయలకు బ్యాక్టీరియా, వైరస్‌లు ఆశించి పంటలు దెబ్బతినే అవకాశం ఉందన్నారు.

ఎడతెరిపిలేని వర్షం


బత్తలపల్లిలోని ధర్మవరం రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

బత్తలపల్లి/ నల్లచెరువు: ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, రాప్తాడు నియోజకవర్గాల్లో మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకు తుపాను ప్రభావంతో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. బత్తలపల్లిలోని ఆర్‌కే ఫంక్షన్‌హాల్‌కు వెళ్లే దారిలోనూ, టీచర్స్ కాలనీకి వెళ్లే దారితో పాటు పలు వీధుల్లో రోడ్డుపై వర్షపునీరు నిలిచింది. నల్లచెరువు మండల కేంద్రంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ వద్దకు వెళ్లే రోడ్డుపై వర్షపు నీరు నిల్వ ఉండడంతో కాలనీ వాసులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

ముంపులో ఎస్సీ కాలనీ

బత్తలపల్లి మండలం సంజీవపురం వద్ద ఆరేళ్ల క్రితం జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డు ఎత్తు పెంచారు. దీంతో వర్షపు నీరు వెళ్లేందుకు దారిలేక సమీపంలోని ఎస్సీ కాలనీలో నిలిచిపోతోంది. కాలనీ పైభాగంలోని కాటమయ్య కొండ మీద నుంచి వర్షపు నీరు వచ్చి కాలనీలోకి చేరుతోంది. గతంలో కాలనీ నుంచి రోడ్డు దాటుకొని గ్రామం బయటకు వెళ్లే నీరు, ఇప్పుడు రోడ్డు ఎత్తు పెంచి.. కల్వర్టు ఏర్పాటు చేయకపోవడం వల్ల ముందుకు కదలడం లేదు. కాలనీలో వంద కుటుంబాలు ఉండగా.. ప్రస్తుత వర్షానికి పది ఇళ్లల్లోకి నీరు చేరి వస్తువులన్నీ తడిచిపోయాయి. ఎంపీడీఓ నరసింహనాయుడు, ఈఓఆర్డీ క్రిష్టప్ప కాలనీని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. తమకు న్యాయం చేయకపోతే రోడ్డును తవ్వేస్తామని కాలనీవాసులు హెచ్చరించారు.


నల్లచెరువు ఏపీజీబీ వద్దకు వెళ్లే దారిలో వర్షపు నీరు


సంజీవపురం ఎస్సీ కాలనీలో నిలిచిన వర్షపు నీరు

వర్షాల వేళ అప్రమత్తంగా ఉండాలి


రాయలవారిపల్లి బ్రిడ్జి వద్ద పరిశీలిస్తున్న ఆర్డీఓ

పుట్టపర్తి రూరల్: వర్షాలు కురుస్తున్న వేళ అధికారులు, ప్రజలు అప్రమత్తతో ఉండాలని పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ పేర్కొన్నారు. బుధవారం పుట్టపర్తి సమీపాన రాయలవారిపల్లి బ్రిడ్జి, రూరల్ పరిధిలోని గాజులపల్లిమరువ వంకను మండల రెవెన్యూ అధికారులు కళ్యాణ్, చంద్ర తదితర అధికారులతో కలసి ఆర్డీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ చెరువులు, కుంటలు, వంకలు, నదులు పొంగినపుడు ఏదైనా విపత్కర పరిస్థితులు సంభవిస్తే వెంటనే అధికార యంత్రాంగానికి సమాచారమందించాలని కోరారు. డీఎస్పీ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ముందస్తు చర్యలు చేపట్టండి

అమడగూరు: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అధికారులంతా అప్రమతంగా ఉండాలని ఆర్డీఓ వెంకటసన్యాసిశర్మ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన రెవెన్యూ కార్యాలయంలో మండలాధికారులతో సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ వర్షాలకు ఆస్తి, ప్రాణ నష్టం లేకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మరువ పారుతున్న పేరంవాండ్లపల్లి చెరువును పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామనాథరెడ్డి, ఎంపీడీఓ మునెప్ప, డిప్యూటీ తహసీల్దార్ వెంకటరెడ్డి, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

నల్లచెరువు: తలుపుల మండలం కుర్లికి బదిలీ అయిన తలమర్లవాండ్లపల్లి పంచాయతీ కార్యదర్శి రమణప్పనాయుడిని బుధవారం సిబ్బంది పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది హనుమంతు, ప్రసాద్, రాధ, సాగైరాబాను, భాగ్యమ్మ, ఇంద్రజ, మాజీ వలంటీర్లు నరేంద్ర, నందిని,కేశవ, అంగన్వాడీ కార్యకర్త గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మాజీ సర్పంచ్ మృతి

కనగానపల్లి: మండలంలోని యలకుంట్ల గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ (54) బుధవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. లక్ష్మీనారాయణ రెండు నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. దీంతో ఆయన్ని అనంతపురంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. కొద్దిరోజుల తర్వాత ఆరోగ్యం కొద్దిగా కుదుటపడటంతో డిశ్చార్జి అయ్యారు. ఇటీవల ఆరోగ్యం విషమించడంతో రెండు రోజుల క్రితం ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స అందించినా కోలుకోలేకపోయారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మద్యం దుకాణాలు ప్రారంభం

ధర్మవరం: కూటమి పార్టీ నేతల సిండికేట్‌కు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ నాయకులు ధర్మవరంలో మద్యం దుకాణాలను బుధవారం ప్రారంభించారు. ఎల్‌సీకేపురంలో 7వ షాప్‌ను వైఎస్సార్‌సీపీ నాయకుడు బాలిరెడ్డి, పోతుకుంట ఆర్‌యూబీ వద్ద 3వ నంబర్ షాపును తాడిమర్రి రవీందర్‌రెడ్డి పూజలు చేసి ప్రారంభించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఎమ్మార్పీకే మద్యం విక్రయిస్తామని, పోలీస్, ఎక్సైజ్ అధికారులు తమకు రక్షణ కల్పించి సహకరించాలని వారు పేర్కొన్నారు.

ఎప్పటికప్పుడు సమాచారమివ్వండి

గాండ్లపెంట : తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ఎక్కడైనా ఇబ్బందులు, సమస్యలు ఎదురైతే రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు సమాచారం చేరవేస్తుండాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సూచించారు. బుధవారం తలుపుల మండలం నుంచి గాండ్లపెంట మీదుగా వెళ్తున్న జేసీ రెక్కమాను వద్ద ఆగి రెవెన్యూ అధికారులతో వర్షాలపై ఆరా తీశారు. వర్షాలు తగ్గే వరకు అప్రమత్తంగా ఉండాలని డీటీ బాబూరావును ఆదేశించారు.

20 మద్యం బాటిళ్ల స్వాధీనం

గాండ్లపెంట: గాజులవారిపల్లి పెద్దతండాలో ఖాజానాయక్ వద్ద అక్రమంగా ఉన్న 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కృష్ణవేణి బుధవారం తెలిపారు. మద్యం అమ్ముతున్న సమాచారం అందుకుని హెచ్‌సీ తిరుమలరెడ్డి, కానిస్టేబుల్ శీనాతో కలిసి దాడులు చేసినట్లు చెప్పారు. ఖాజానాయక్‌ను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉద్యోగికి కరెంట్ షాక్

పుట్టపర్తి టౌన్: పట్టణంలో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ఫైబర్‌నెట్ విభాగంలో పనిచేసే పీరూసాబ్ కరెంట్‌షాక్‌కు గురయ్యాడు. అక్కడ ఉన్న స్తంభం వర్షానికి తేమగా ఉంది. పీరూసాబ్ స్తంభం పక్కనే ఉన్న బైక్‌ను తీసుకునే క్రమంలో షాక్‌కు గురయ్యాడు. వెంటనే స్థానికులు అప్రమత్తమై కర్ర సహాయంతో అతడిని ప్రమాదం నుంచి తప్పించారు. అనంతరం విద్యుత్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని విద్యుత్ సరఫరా కాకుండా చర్యలు తీసుకున్నారు.

ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు


చెన్నేకొత్తపల్లిలో ఇళ్ల మధ్య నిలిచిన వర్షపు నీరు

చెన్నేకొత్తపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మండలంలో బుధవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షపు నీరు గ్రామాల్లోని రోడ్లపై ప్రవహించింది. బసంపల్లి గ్రామంలో వర్షపు నీరు ఇళ్లలోకి చేరింది. చిన్న చిన్న గుంతలు వర్షపు నీటితో నిండాయి. ఎడతెరిపి లేని వర్షం కారణంగా జాతీయ రహదారిలో వాహనాలు నిలిచిపోయాయి.

పెడపల్లిలో వాల్మీకి విగ్రహ ప్రతిష్ట నేడు


ప్రతిష్టించనున్న వాల్మీకి విగ్రహం

పుట్టపర్తి అర్బన్: పెడపల్లిలోని రామాలయం ఎదురుగా గురువారం వాల్మీకి విగ్రహాన్ని ప్రతిష్టించనున్నారు. వాల్మీకి సామాజిక వర్గం వారు చందాల రూపంలో రూ.12 లక్షలు పోగు చేసుకుని విగ్రహాన్ని, మంటపాన్ని ఏర్పాటు చేశారు. వాల్మీకి జయంతి సందర్భంగా విగ్రహాన్ని ప్రారంభించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

మున్సిపాలిటీలో కంట్రోల్ రూమ్

ధర్మవరం అర్బన్: కలెక్టర్ ఆదేశాలతో తుపాన్ సహాయక చర్యల కోసం మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. సహాయక చర్యలు కావాల్సిన వారు 76589 51274, 85559 79326, 89194 93957 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆర్థికసాయం అందించండి

పుట్టపర్తి టౌన్: చిలమత్తూరు మండలంలోని నిర్మాణంలో గల పేపర్ మిల్లు వద్ద అత్యాచారానికి గురైన అత్తాకోడళ్ల కుటుంబానికి జీవనభృతి కోసం ఆర్థికసాయం అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ ప్రభుత్వాన్ని కోరారు. పేపర్ మిల్లు యజమానులపై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి ఈఎస్ఐ, పీఎఫ్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.